

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా వైద్యులు, వైద్యసిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చట్టాలను అమలు చేయాలి. రాత్రి వేళ వైద్యశాలల్లో విధులు నిర్వహించే మహిళా డాక్టర్లు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలి. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీలకు రాత్రి వేళ పోలీసు సెక్యూరిటీ కల్పించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా టాయిలెట్లు, డ్రస్ ఛేంజింగ్ రూములు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, కలిగిరి పీహెచ్‌సీ

రాత్రి వేళ రక్షణ అవసరం



కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మానవమృగాలను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్‌లో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కావు. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు, వైద్యసిబ్బంది రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేని కారణంగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ లక్ష్మీమాధురి, స్టాఫ్ నర్సు, జలదంకి పీహెచ్‌సీ

కఠిన చట్టాలు తప్పనిసరి



విధి నిర్వహణలో ఉన్న డాక్టర్లకు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. సమాజంలో మహిళలపై జరిగే దారుణాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు చేయాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందించే డాక్టర్లకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ కీర్తిప్రియ, కసుమూరు పీహెచ్‌సీ



క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కిరణ్‌రెడ్డి

మనుబోలు: మండలంలో 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఒక్కో పంచాయతీకి భారీగా నిధులు అందజేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పాడని, అయితే క్షేత్రస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గతంలో జిల్లాలో రోజుకు సగటున 75 వేల పనిదినాలు కల్పిస్తుండగా.. ప్రస్తుతం అవి 10 వేలకు తగ్గిపోయాయన్నారు. టీడీపీ వారు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును రూ.3 లక్షలకు అమ్ముకున్నారని బీజేపీ నాయకుడు ఆరోపించారని, ఇది అధికారపక్షానికి సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఉపాధి పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రామాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



మాట్లాడుతున్న వైద్యాధికారి

కొడవలూరు: మండలంలోని రామాపురంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి జనార్దన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్న వారి వద్దకెళ్లి వైద్య సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు సౌమ్య, రజిత, హెచ్ఏ సురేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి

ముత్తుకూరు: ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ధరణిజ తదితరులు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జొన్నవాడలోని మల్లికార్జున స్వామి కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈఓ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

పొదలకూరు: మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.మోహన్‌రాజు (60) గురువారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో పొదలకూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు పేర్కొన్నారు. మోహన్‌రాజు వైఎస్సార్‌సీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడిగా కొనసాగుతున్నారు. శుక్రవారం దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య, నాయకులు నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు చిన్నబజార్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోటమిట్ట వాసి అల్లానూర్ ఖాన్ చికెన్ పకోడా బండిని నిర్వహిస్తున్నాడు. వ్యాపార, కుటుంబ ఆర్థికావసరాలకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధుమిత్రులు, స్నేహితులను ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు. దీంతో చిన్నబజార్ పోలీసులకు అతని తండ్రి ఖుదైనూర్‌ఖాన్ ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసును నమోదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి వివరాలను జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపారు.

కబ్జా కోరల్లో చిక్కి..

- దర్జాగా చెరువుల ఆక్రమణ
- వందల ఎకరాలు అన్యాక్రాంతం
- నియోజకవర్గ వ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి
- చివరి ఆయకట్టుకు తప్పని సాగునీటి తిప్పలు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఎగువభాగంలో ఆక్రమణకు గురైన భూమి

ఈ చిత్రంలో కనిపిస్తోంది మనుబోలు పెద్ద చెరువు. దీని ఆయకట్టు కింద 600 మంది చిన్న, సన్నకారు రైతులు సుమారు 1500 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఎగువ భాగంలో సుమారు 25 ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఆక్రమణల కారణంగా చెరువు పూర్తిగా నిండే పరిస్థితి లేదు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి నెలకొంది.

ఈ చిత్రంలో కనిపిస్తోంది మనుబోలు మండలంలోని మడమనూరు పెద్ద చెరువు. దీని కింద 450 మంది రైతులు సుమారు 1,200 ఎకరాలు సాగు చేస్తున్నారు. చెరువుకు సంబంధించి వంద ఎకరాలకు పైగా కబ్జాకు గురై వైశాల్యం తగ్గిపోయింది. నీటి నిల్వ సామర్థ్యం తగ్గి వర్షాభావ సమయాల్లో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిపోవడం లేదు.



మడమనూరు చెరువు పరిధిలో సాగు కోసం సిద్ధం చేసిన భూమి (ఫైల్)

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు చెరువులు కబ్జారాయుళ్ల కబంధహస్తాల్లో చిక్కుకున్నాయి. ఫలితంగా వాటి వైశాల్యం తగ్గిపోయి చివరి ఆయకట్టు రైతులకు ప్రతి సంవత్సరం సాగునీటి కష్టాలు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితులతో చెరువులకు నీరు సరిగా చేరేది కాదు. దీంతో చాలాభాగం ఖాళీగా ఉండేది. ఈ నేపథ్యంలో కబ్జాదారులు రెచ్చిపోయారు. ఖాళీ గా ఉన్న చెరువు భూములను ఆక్రమించుకున్నారు. కొందరు ఒకడుగు ముందుకేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తిరిగి వేరే వ్యక్తులకు విక్రయించిన దాఖలా లు కూడా ఉన్నాయి. అన్యాక్రాంతమైన భూములు పలువురి చేతులు మారడంతో వీటిని విడిపించడం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో తమకేం పట్టనట్లుగా ఉన్నారనే విమర్శలున్నాయి.

ఎక్కడెక్కడ ఎలా..

- ⇨ మనుబోలు మండలం ఎల్ఎన్‌పురం గ్రామానికి చెందిన బంగారమ్మ చెరువు మొత్తం వైశాల్యం 448 ఎకరాలు. ఇందులో 120 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైవుంది. మడమనూరు పెద్ద చెరువులో వందెకరాలు, చిన్న చెరువులో 30 ఎకరాలు కబ్జాకు గురైంది. మనుబోలు పెద్ద చెరువును సీఎం నగర్, ఎరుకల కాలనీ సమీపంలో కొందరు గ్రామస్తులు సుమారు 25 ఎకరాల మేర ఆక్రమించుకుని ఏటా వరిసాగు చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవే కాకుండా చెర్లోపల్లి, కుడితిపల్లి, కాగితాలపూరు, గురివిందపూడి, కొమ్మలపూడి, వడ్లపూడి, వీరంపల్లి, అక్కంపేట, బండేపల్లి, జట్ల కొండూరు, బద్దెవోలు, వెంకన్నపాళెం తదితర గ్రామాల్లో చెరువులను దర్జాగా కబ్జా చేశారు.
- ⇨ పొదలకూరు మండలంలోని నావూరు, పొదలకూరు, బిరదవోలు, ముదిగేడు, నేదురుమల్లి, వెంకటాచలం మండలంలోని కనుపూరు, సర్వేపల్లి రిజర్వాయర్లలో భారీగా ఆక్రమణలున్నట్లు ఆరోపణలున్నాయి.
- ⇨ తోటపల్లిగూడూరు మండలంలో మొత్తం 38 చెరువులుంటే సగానికి పైగా భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి.
- ⇨ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో సుమారు 200 ఇరిగేషన్ చెరువులుంటే వందలాది ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి.

చర్యలు శూన్యం



ఇష్టారాజ్యంగా చెరువులను ఆక్రమించుకుంటున్నా కబ్జాదారులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాదారులు సదరు భూముల్లో రొయ్యల గుంతలు, వరిసాగు చేస్తున్నారు. దీంతో చెరువు వైశాల్యం కుచించుకుపోయి నీటి సామర్థ్యం తగ్గిపోయింది. దీని మూలంగా చివరి ఆయకట్టుకు సాగునీరందక చివరి దశలో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

– గుమ్మడి వెంకటసుబ్బయ్య, రైతు, ఎల్ఎన్‌పురం

ఇష్టారాజ్యంగా ఆక్రమణలు



చెరువు భూములపై ఎలాంటి నిఘా లేకపోవడంతో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. నీటి లభ్యత కారణంగా ఓ వైపు సాగు భూమి పెరుగుతుంటే ఆక్రమణల కారణంగా చెరువులు మాత్రం నానాటికీ తగ్గిపోతున్నాయి. అధికార యంత్రాంగం స్పందించి చెరువులను సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలి.

– వెందోటి భాస్కర్‌రెడ్డి, కనుపూరు కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, కొండూరుసత్రం

ఫిర్యాదు చేస్తే చర్యలు



చెరువు భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం. ఆక్రమణల వల్ల ఎంతోమంది రైతులు సాగునీరందక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువుల ఆక్రమణపై రైతులు ఫిర్యాదు చేస్తే సర్వే చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ సుబ్బయ్య, తహసీల్దార్

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు వేయిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

విడవలూరు: మండలంలోని ముదివర్తి గ్రామం దళితవాడలో నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 21వ తేదీన సాక్షిలో 'నీరు రాక.. జనం కష్టాలపాలు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి సమస్య గురించి ఆరాతీశారు. ఆమె ఆదేశాలతో అధికారులు శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాల మైదానంలో బోరు పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

నగదు వసూలు చేస్తే సహించం



మాట్లాడుతున్న ఎస్సై సాయిప్రసాద్

విడవలూరు: వినాయక చవితి సందర్భంగా ఎవరైనా రోడ్డుకు అడ్డంగా తాడు కట్టి నగదు వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయిప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. విగ్రహ ప్రతిష్ట, ఉత్సవాల్లో డీజే, మైక్‌సెట్‌లకు అనుమతి తీసుకోవాలన్నారు.

విత్తనశుద్ధి పాటిస్తే అధిక దిగుబడులు

పొదలకూరు: వేరుశనగలో విత్తనశుద్ధి పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందని పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.ప్రసన్నరాజేష్ సూచించారు. మండలంలోని సూరాయపాళెంలో వేరుశనగ పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇసుక నేలల్లో వేరుశనగ పండించే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులను కలిపి కలియదున్నాల్సిందిగా తెలిపారు. మొక్కల మధ్య ఎడం పాటిస్తే దిగుబడులు పెరుగుతాయని, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం కనుగొన్న వేరుశెనగ విత్తనాలను విత్తుకోవాల్సిందిగా సూచించారు. తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎస్‌కే హసీనాభాను, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు తదితరులు

అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

కొడవలూరు: రైతులు పంటల సాగు కోసం అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి తెలిపారు. కొడవలూరులో శుక్రవారం ఆమె పర్యటించి సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కాండం తొలుచు పురుగు నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలో వివరించారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ నెలాఖరుకు వరి కోతలు మొదలవుతున్న నేపథ్యంలో మిగిలి ఉన్న వారు కూడా పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం కేఎన్ఎం 1638 రకం సాగులో ఉన్నందున దీనికి మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉందన్నారు. పుట్టి ధర రూ.20,500 పలుకుతోందన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏ జి.కవిత, రైతులు కోవూరు వెంకీ, నక్కా రమణయ్య, అంబటి విజయకుమార్, కొప్పు రమేష్ పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి

గ్రామసభల్లో అధికారులపై ప్రశ్నల వర్షం

విడవలూరు: మండలంలోని 15 పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం సభలు జరిగాయి. కొన్నిచోట్ల గ్రామస్తులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధి హామీ పనులు చేసినా దానికి సంబంధించిన నగదు సక్రమంగా పడడం లేదని, జాబ్‌కార్డుల కోసం అర్జీలు ఇచ్చినా ఇంకా రాలేదని, మరికొన్ని సమస్యలపై ప్రశ్నించారు. అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. దీంతో అర్జీలివ్వండి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అవగాహన లేనప్పుడు తమను సభలకు ఎందుకు పిలిచారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలామంది వెళ్లిపోయారు.

- ➡ **పొదలకూరు:** ఉపాధి పనుల్లో పారదర్శకత కోసమే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యగారిపాళెంలో శుక్రవారం జరిగిన సభకు ఆయన హాజరై మాట్లాడారు. పనులను గుర్తించి పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ నగేష్ కుమారి, సర్పంచ్ కండే వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.
- ➡ మండలంలోని 30 పంచాయతీల్లో అధికారులు సభలను నిర్వహించారు. పొదలకూరులో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ అధ్యక్షతన సభ జరిగింది. గుర్తించిన పనులను సెక్రటరీ దుర్గా దొరబాబు చదివి వినిపించారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ పాల్గొన్నారు. పార్లపల్లి గ్రామసభను ఎంపీడీఓ టి.నగేష్ కుమారి నిర్వహించారు.
- ➡ **వెంకటాచలం/మనుబోలు:** మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సభకు ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే ఆయన మనుబోలు మండలంలోని పిడూరు గ్రామంలో జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ఊరికే కాలక్షేపం చేస్తామంటే కుదరదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- ➡ **ముత్తుకూరు:** ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు 150 రోజుల పనిదినాలు కల్పించాలని సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు కోరారు. మండలంలోని పంటపాళెం, ముత్తుకూరు, పాటూరువారికండ్రిగ గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పీపీ కండ్రిగలో సర్పంచ్ రాజారామరెడ్డి, టీఏ రాజేశ్వరి పాల్గొన్నారు.



పొదలకూరు: మాట్లాడుతున్న సోమిరెడ్డి



కోవూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

మద్యం షాప్‌తో ఇక్కట్లు

కోవూరు: స్థానిక పెళ్లకూరు కాలనీకి సమీపంలో ఉన్న మద్యం షాప్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం కోవూరు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మితారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ నిర్మలనంద బాబా, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత పాల్గొన్నారు.

- ➡ **ఇందుకూరుపేట:** మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో శుక్రవారం సభ జరిగింది. ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు మాట్లాడారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు. కొత్తూరులో జరిగిన సభలో తహసీల్దార్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.
- ➡ **కొడవలూరు:** మండలంలోని నార్తురాజుపాళెంలో సర్పంచ్ బి.సుప్రియ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో ఈఓపీఆర్డీ వి.డేవిడ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని సమస్యలపై వినతులు సమర్పిస్తే పంచాయతీ నిధులతోనే పరిష్కరించుకోవచ్చన్నారు. ఉపాధి పనులపై చర్చించారు. పలు సమస్యలపై టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, ఎంపీటీసీ పి.అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

మనుబోలు: శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని మనుబోలు విష్ణాలయంలో సామూహిక కుంకుమార్చన పూజలు జరిగాయి. అర్చకులు హనుమాచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అలాగే గ్రామదేవత గంగమ్మ ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

- **ఇందుకూరుపేట:** గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం పసుపు కొమ్ముల అలంకారం చేశారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది.
- **పొదలకూరు:** శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం స్వామికి అభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా రమేష్ – మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు.

సామూహిక లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో మల్లికార్జున స్వామి కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం సామూహిక లక్ష కుంకుమార్చన జరిగింది. అలంకార మండపంలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో గంగమ్మ



ఇందుకూరుపేట: పసుపు కొమ్ములతో అలంకరణ



పొదలకూరు: పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



జొన్నవాడలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

వీఎస్‌యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఇన్‌చార్జి వీసీ తదితరులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక రంగంపై మక్కువ పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఆర్ఎం గ్రూప్ సంస్థల ఈడీ డి.నారాయణరావు స్పేస్ సైన్స్ ప్రాముఖ్యత, అప్లికేషన్ల గురించి వివరించారు. వీఎస్‌యూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ గ్రీన్ ఎనర్జీ, విక్రమ్ శాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, పోస్టర్ మేకింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

- ➡ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని వర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.